

# మనం
## హైదరాబాద్
### రంగారెడ్డి | మేడ్చల్

శుక్రవారం | 25 | ఏప్రిల్ | 2025 పేజీలు: 7


## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు



ఉస్మానియా వర్సిటీ, మనం న్యూస్: అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలను మూడు రోజుల పాటు మూడు సెషన్లలో ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పరీక్షల కోసం మొత్తం 9,747 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని.. కంప్యూటర్ బేస్డ్‌గా నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు కేంద్రాలను హైదరాబాద్ నగరంలోనే ఏర్పాటు చేశామని రంగారెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రానికి పరీక్ష ప్రారంభమయ్యే 90 నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో చూసుకోవాలని స్పష్టం చేశారు.



# ఇంత నిర్లక్ష్యమా?



- -ఏడాదిగా వీధిలైట్ల సమస్య
- -పరిష్కరించని బల్దియా పాలకవర్గం
- -ముగిసిన ఈఈఎస్ఎల్ టెండర్ గడువు
- -ముందస్తు ప్రణాళికలు ఉండవా?
- -మూడు నెలల పాటు పొడిగింపు?
- -బల్దియా బాస్ ఇలంబర్తి దృష్టి సారిస్తారా?

*భాగ్యనగరం బ్యూరో, మనం న్యూస్: ఒక అడుగు ముందుకు... ఆరు అడుగులు వెనక్కి... అన్నట్లుగా బల్దియా ప్రణాళిక కొనసాగుతోంది. ఐఏఎస్‌లు.. ఐపీఎస్‌లకు తోడుగా గ్రేడ్-1 అధికారులు ఉన్నా... సుదీర్ఘమైన పరిపాలనా అనుభవం ఉన్న పాలక మండలి ఉన్నా... పౌరులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకు ఉదాహరణగా వీధి లైట్ల వ్యవహారం నిలిచింది. ఏడాది నుంచి వీధి లైట్ల వ్యవహారం వివాదాస్పదంగా మారినా... దిద్దుబాటు చర్యలు చేపట్టడంలో బల్దియా విఫలమయ్యింది. ఇక వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలను చేపట్టిన ఈఈఎస్ఎల్ గడువు ముగుస్తుందని తెలిసినా.. ముందస్తు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున టెండర్ ప్రక్రియ చేపట్టలేదని.. ఉన్న సంస్థకే కొన్ని నెలల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించి.. టెండర్ ప్రక్రియ చేపట్టి నూతన సంస్థకు వీధి లైట్ల నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తామని అధికారులు సన్నాయి నొక్కుళ్లు నొక్కుతుండటం చూస్తుంటే... ఏడాదికి రూ.2 వేల కోట్ల పైచిలుకు ఆస్తిపన్ను కడుతున్న ప్రజలకు బల్దియా అందిస్తున్న సేవలు ఏమిటి? అనేది విమర్శలకు తావిస్తున్నది.*

వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలను జీహెచ్ఎంసీ ఈఈఎస్ఎల్‌కు అప్పగించింది. గ్రేటర్ పరిధిలోని 150 డివిజన్‌లలో సోడియం మెర్క్యూరీ లైట్లతో వెలుగులు అందిస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఎల్ఈడీ లైట్‌లతో తక్కువ విద్యుత్ వినియోగంతో మెరుగైన వెలుతురు అందిస్తూ జీహెచ్ఎంసీకి విద్యుత్ చార్జీల భారం పెద్ద మొత్తంలో తగ్గుతుందని భావించారు. ఈఈఎస్ఎల్ సంస్థ చేసిన సిఫార్సులను అమోధించి 7 సంవత్సరాల ప్రయోగాత్మకంగా పరిశీలించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈఈఎస్ఎల్ ఆధ్వర్యంలో 5 లక్షల 50వేల స్ట్రీట్ లైట్‌లు ప్రస్తుతానికి కొనసాగుతున్నాయి. విధుల్లో లైట్లు వెలగడం లేదని గడచిన ఏడాదిగా ఫిర్యాదులు అందుతున్నాయి. రోజుకు వందల సంఖ్యలోనే ఫిర్యాదులు అందుతున్నాయి. అందులో ముప్పయి శాతం కూడా ఫిర్యాదులను పరిష్కరించడం లేదు. అయితే ఈఈఎస్ఎల్‌కు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో సమస్య నెలకొంది. నిధుల లేమితో ఉద్యోగులకు జీతాలు చెల్లించడం.. పరికరాల కొనుగోళ్ల చేయలేకపోతున్నామని ఈఈఎస్ఎల్ చెబుతున్నది. అధికారులు సైతం మొండికేసి వీధిలైట్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రజలు చీకట్లలోనే కాలం వెళ్లదీయాల్సి వస్తున్నది. ఇదిలాఉండగా బల్దియా ఎలక్ట్రిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వారు పదోన్నతులు పొందుతూ అదే స్థానాల్లో కొనసాగుతూ వీధిలైట్ల తమాషాను చూస్తున్నారు. ఉద్యోగుల కొరత కారణంగా పనులు కూడా జరగడం లేదని సమాచారం. ఈ క్రమంలోనే ఏఈలు డీఈలుగా.. డీఈలు ఈఈలుగా వ్యవహరిస్తూ మమా అనిపిస్తున్నారు. ఇక 20 శాతం మంది డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న వారు ఉండటం గమనార్హం. డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఆరేళ్ల సమయం పూర్తి చేసుకున్నా.. తమ సొంత శాఖకు వెళ్లరు.. ఇక్కడి అధికారులు వారిని రిలీవ్ చేయరూ... ఈ విషయాలు బల్దియా బాస్ ఇలంబర్తికి తెలుసా? అనేది అర్థం కావం లేదు. ఏదేమైనా వీధి లైట్ల సమస్య పరిష్కారం కోసం బల్దియా బాస్ ఇలంబర్తి ఎటువంటి చర్యలు చేపడతారు? అనేది వేచిచూడాల్సిందే.

## ట్యూటెమ్ యాప్

### -మహిళలకు మెట్రో సురక్షితం



సిటీబ్యూరో, మనం న్యూస్: ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సురక్షితమైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రకటించింది. హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్ పోలీస్ సహకారంతో బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, ఐఐటీ ఖరగ్ పూర్, ఐఐటీ బొంబాయి సంయుక్తంగా ఏడీబీ ఆర్థిక సహాయంతో ట్యూటెమ్ (టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టు ఎన్హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ) అనే కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. యాప్ రూపంలో ఇది త్వరలో హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి రాబోతుంది. ఈ సందర్భంగా బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో జరిగిన యూజర్ వర్క్ షాప్‌లో మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మెట్రోలో ప్రయాణించే వారు.. ముఖ్యంగా మహిళలు తమ చిట్టచివరి గమ్యస్థానానికి భద్రంగా చేరడానికి ట్యూటెమ్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తమ ఇళ్ల నుంది గమ్యస్థానాల వరకు రాకపోకలు సాగించే ప్రక్రియలో ప్రయాణ పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అనేక సౌకర్యాలు ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో పొందుపరిచామని..యాప్ లో డ్రైవర్ యాప్, యూజర్ యాప్ అని రెండు భాగాలు ఉంటాయని, దీనిలో ప్రయాణీకులను, ముఖ్యంగా మహిళా ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే అన్ని జాగ్రత్తలు పొందుపరచడం జరిగిందన్నారు.



## ఏర్పాట్లు పూర్తి

ట్యాంక్‌బండ్, మనం న్యూస్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, ఓట్ల లెక్కింపునకు సంబంధించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను -మిగతా 2లో



## బీసీ రిజర్వేషన్లు

### -42 శాతానికి పెంచాకే ఎన్నికలు జరపాలి
### -జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

2



# ఏర్పాట్లు పూర్తి

మొదటి పేజీ తరువాయి

పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, వీడియో రికార్డింగ్, సెక్యూరిటీ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపుకు ప్రత్యేక కౌంటింగ్ టేబుల్స్, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు

**-42 శాతానికి పెంచాకే ఎన్నికలు జరపాలి**

**-జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్**

రవీంద్రభారతి, మనం న్యూస్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేక పక్షంలో యుద్ధం జరుగుతుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి బీసీలను బలిచేస్తుందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బీసీ రిజర్వేషన్ల కోసమే 12 నెలల క్రితం జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడుతూ వచ్చాయని తెలిపారు. అలాంటిది బీసీ రిజర్వేషన్ల అంశం పూర్తిగా పరిష్కారం కాకముందే, తొందరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి సీతక్క ప్రకటించడం దారుణమని అన్నారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. రిజర్వేషన్లను పెంచకుండానే ఎన్నికలకు వెళ్తే రాష్ట్రంలో యుద్ధం తప్పదని హెచ్చరించారు. దీనిపై వెయ్యి మందితో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలను గ్రామాల్లో తిరగనివ్వమని అన్నారు. బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసి, ఇంతవరకు జీవో ఎందుకు జారీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో చట్టం చేశాక కేంద్రానికి పంపుతామని ప్రకటనలు వెలువడ్డాయే తప్ప ఇంతవరకు దానిపై అతీగతి లేదని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని అన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, దాన్ని కేంద్రంపై నెట్టివేయడం బీసీలను దగా చేయడం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మీనమేషాలు లెక్కించడం మానుకొని బీసీలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీసీల తిరుగుబాటు తప్పదని వార్నింగ్ ఇచ్చారు.



# బీసీసీఐ అండర్-19

**-హైదరాబాద్ సిటీ అమ్మాయిలకు అవకాశం**

**-స్థానం దక్కించుకున్న ఏడుగురు అమ్మాయిలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 24 (మనం న్యూస్): బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి సిటీకి చెందిన ఆరుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఒకే సారి ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు త్వరలోనే జట్టు-ఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీ, కాగా, టీమ్ -డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్-బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్-19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో శుక్రవారం ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొంటారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

# బీఎంఎస్ బలపడుతోంది

**-బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి**

ట్యాంక్‌బండ్, మనం న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభాకు అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి తో పాటు అత్యవసర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీలో రోజురోజుకి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) బలపడుతుందని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి అన్నారు. బీఎంఎస్ గుర్తింపు పొందిన భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్‌లో గురువారం పలువురు కార్మిక నేతలు బీఎంఎస్ నేతలు చేరారు. గతంలో బీఎంస్‌లోని పని చేసి, ఇతర యూనియన్ లోకి వెళ్లిన గడ్డం శంకర్, బసవపురం సూర్యకుమార్, ముఖేశ్ లు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజేశ్వరరావు, జనరల్ సెక్రటరీ టి. కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు రాంరెడ్డి నేతలకుకుండవాలను కప్పి, యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తూర్పు రాంరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో పలు సార్లు బీఎంఎస్ అఖండ విజయం సాధించి సాధించి, కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గడిచిన రెండు దశాబ్దాలుగా బీఎంఎస్ కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించి, వారి ప్రయోజనాలను కాపాడిందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో కార్మికులు, ఉద్యోగులకు అండగా ఉన్న బీఎంఎస్ త్యాగ్ తపస్య, బలిదాన్ అనే నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ లాంటి పెద్ద విభాగంలో కార్మికులు, ఉద్యోగులు ఐకమత్యంతో ఉన్నపుడే వారి సమస్యలు పరిష్కారమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.రాజేశ్వరరావు, జనరల్ సెక్రటరీ టి.కృష్ణ మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని ఇతర యూనియన్ల నుంచి ఇప్పటి వరకు వంద మంది వరకు యూనియన్ నేతలు, కార్యకర్తలు, ఉద్యోగులు బీఎంఎస్‌లో చేరినట్లు వివరించారు. జీహెచ్ఎంసీ యూనియన్ గుర్తింపు ఎన్నికలు సర్కారు ఎపుడు నిర్వహించినా,



బీఎంఎస్ గెలుపు సాధిస్తుందని, రోజురోజుకి బలపడుతూ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎం.జాబ్రీ, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాక్రిష్ణ, ఉపాధ్యక్షులు భిక్షపతి,మహిళా విభాగం నాయకురాలు మనోరమా, గడిపల్లి రూపేశ్, ప్రధాన కార్యాలయం ఇన్ ఛార్జి పవన్ కుమార్, ఖైరతాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేశ్, నేతలు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# ది జెంటిల్మెన్స్ లీగ్ ఆవిష్కరించిన పీటర్ ఇంగ్లాండ్

బంజారాహిల్స్,మనం న్యూస్: జియోస్టార్ ఐపీఎల్ ను పురస్కరించుకొని ది లీగ్ ఆఫ్ లెజెండ్స్ క్యాంపెయిన్ కొనసాగింపుగా ది జెంటిల్మెన్స్ లీగ్ క్యాంపెయిన్ ను ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ లిమిటెడ్ కు చెందిన పీటర్ ఇంగ్లాండ్ ఆవిష్కరించింది. ఈ విషయమై పీటర్ ఇంగ్లాండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనిల్ ఎస్ కుమార్ మాట్లాడుతూ జెంటిల్మెన్స్ లీగ్ కలెక్షన్ కొనసాగింపు నుంచి కొత్త లీగ్ ఆఫ్ లెజెండ్స్ క్యాప్సూల్ తీసుకొచ్చామన్నారు. క్రికెట్ ను అందరికీ నచ్చేలా చేసిన వ్యక్తులు ధరించిన దుస్తుల ఆకర్షణకు తమ వినయపూర్వకమైన నివాళిగా అభివర్ణించారు. కపిల్ దేవ్, సర్ వివియన్ రిచర్డ్స్, హర్ష భోగ్లే వంటి దిగ్గజాలు క్యాంపెయినులో ఉండటంతో ఈ కలెక్షన్ను ప్రామాణికమైనది, ఆకాంక్షించేదిగా చేస్తుందన్నారు. అభిరుచితో దుస్తులు ధరించే ఆధునిక భారతీయుడికి




ఇది ఒక సాహసోపేతమైన కొత్త అధ్యాయంగా అభివర్ణించారు. సాంప్రదాయ క్రీడా వస్తువుల్లా కాకుండా ఈ కలెక్షన్ క్రికెట్ ను బేస్ చేసుకుని రూపొందించిన ఫ్యాషన్ను స్మార్ట్ క్యాజువల్, స్పోర్ట్స్-ఫార్మల్ లెన్స్ ద్వారా తిరిగి మొదలుపెట్టిందన్నారు. భారతదేశ ఫ్యాషన్ ల్యాండ్స్కేప్లో ఇది ఒక విలక్షణమైన స్థానం కలిగి ఉందన్నారు. ఖచ్చితమైన టైలరింగ్, శ్వాసక్రియకు అనువైన బట్టలు, వారసత్వ-ప్రేరేపిత వివరాలతో ది లీగ్ ఆఫ్ లెజెండ్స్ బోర్డ్ రూమ్ నుంచి ఆఫ్టర్-అవర్స్ వరకు, మ్యాచ్ స్క్రీనింగ్ల నుంచి వారాంతపు విహారయాత్రల వరకు అప్రయత్నంగా కదిలే బహుముఖ వార్డ్ రోబ్ను అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ కలెక్షన్ దేశంలో ఉన్న 240కి పైగా పీటర్ ఇంగ్లాండ్ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ అవుట్లెట్లలో, బ్రాండ్ ఆన్లైన్ స్టోర్లో అందుబాటులో ఉందన్నారు. ఆవిష్కరణ ద్వారా పీటర్ ఇంగ్లాండ్ క్రికెట్ సెలబ్రేట్ చేసుకోవడమే కాకుండా పిచ్ లోపల, వెలుపల జెంటిల్ మేన్ లా ఉండటం అంటే ఏమిటో సరికొత్తగా చాటి చెప్పినట్లయ్యిందని ధీమా వ్యక్తం చేశారు.



## కూకట్పల్లి చెరువుల అభివృద్ధికి చర్యలు

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : కూకట్పల్లి నియోజకవర్గంలోని 9 చెరువులను అభివృద్ధిపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని, స్థానికంగా ఉంటున్న ప్రజలకు, ఆ ప్రాంతంలో కొనుగోలు చేసినవారికి, పట్టాదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా న్యాయం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రా కమిషనర్ రంగనాథుని కలిశారు. ఈ నేపథ్యంలో గురువారం హైడ్రా అధికారులు కూకట్పల్లి నియోజకవర్గంలోని నల్లచెరువు, కాముని చెరువు, సున్నం చెరువు ప్రాంతాల్లో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలు స్థానికంగా కొనుక్కున్నవారికి, పట్టాదారులకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, టిడిఆర్ విషయంలో వారికి భరోసా ఇచ్చే విధంగా అధికారులతో మాట్లాడి సమస్యను కొలిక్కి తెచ్చారు. ప్రజలు మూడు పర్యాయాలు ఎన్నుకున్న కృతజ్ఞతా భావంతో ఎవరికీ ఇబ్బంది కలగకుండా న్యాయం చేసే విధంగా అండగా ఉంటానని, చెరువుల అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎవరికీ నష్టం లేకుండా చెరువులను అభివృద్ధి పరచాలని అధికారులకు తెలిపినట్లు ఆయన అన్నారు.




## డ్రీమ్ టెక్నాలజీ భారతీయ ప్రచారకర్తగా కృతి సనన్




జూబ్లీహిల్స్,మనంన్యూస్: స్మార్ట్ హోమ్ టెక్నాలజీ ఉపకరణాలలో ప్రపంచ అగ్రగామి సంస్థ డ్రీమ్ టెక్నాలజీ తమ భారతీయ ప్రచారకర్తగా బాలీవుడ్ నటి కృతి సనన్ను ఎన్నుకున్నట్లు ప్రకటించింది. ఈ విషయమై డ్రీమ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మను శర్మ మాట్లాడుతూ కృతి సనన్ను డ్రీమ్ కుటుంబంలోకి స్వాగతిస్తున్నందుకు సంతోషిస్తున్నామన్నారు. సాంకేతికత పట్ల ఆమెకున్న ఆసక్తి, ముందస్తు ఆలోచనలతో కూడిన మనస్తత్వం, తెలివైన పరిష్కారాలు, ఉత్పత్తుల ద్వారా భారతీయ గృహాలను పునర్నిర్వచించాలనే తమ లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందన్నారు. డ్రీమ్ ప్రపంచ విస్తరణ వ్యూహంలో భారతదేశం అంతర్భాగం అని పేర్కొన్నారు. కృతి సనన్ తమ విస్తృత శ్రేణి స్మార్ట్ హోమ్ క్లీనింగ్ ఉపకరణాలు, గ్రూమింగ్ ఉత్పత్తులకు ప్రచారం చేయనున్నారని వెల్లడించారు. వీటిలో రోబోటిక్ వాక్యూమ్లు, కార్డ్లెస్ స్టిక్ వాక్యూమ్లు, హై-స్పీడ్ హెయిర్ డ్రైయర్లతో సహా గ్రూమింగ్ ఉత్పత్తులు ఉన్నాయని వివరించారు. అనంతరం నటి కృతి సనన్ మాట్లాడుతూ డ్రీమ్ టెక్నాలజీలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. సౌకర్యంతో ఆవిష్కరణలను మిళితం చేయాలనే తన అభిరుచిని ప్రతిధ్వనించే బ్రాండ్ గా డ్రీమ్ ను అభివర్ణించారు.

## రూ. 31 లక్షలతో రోడ్డు పనుల ప్రారంభం



ఫతేనగర్, మనం న్యూస్ : ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ సీనియర్ సిటిజన్ భవన్ పక్కన ఉన్న ఎల్ఐజిలో రూ. 31 లక్షల నిధులతో రోడ్డు పనులను కార్పొరేటర్ సతీష్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో చేపట్టిన ఈ పనుల్లో స్థానిక ప్రజలు, కాలనీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ గతంలో డ్రైనేజీ సమస్య ఉండటంతో కొత్త డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం రూ. 31 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభిస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విజయకుమార్, డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, జనరల్ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, విజయ్ కుమార్, ఉమామతి గౌడ్, సోమయ్య, సాంబశివరెడ్డి, పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, సంఘ సభ్యులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే శుభకార్యక్రమాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.



## ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్కు ఆహ్వానాలు, వినతులు

కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : కుత్బుల్లాపూర్లోని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ నివాస కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. పలు ఆహ్వానాలు, వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బాలానగర్ కాంగ్రెస్ కార్యాలయంలో సంబరాలు

బాలానగర్, మనం న్యూస్ ; బాలానగర్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గురువారం పండుగ వాతావరణాన్ని తలపించింది. పార్టీ సీనియర్ నాయకులు, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మొహిసిన్ల పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ హాజరై



ఇరువురు నేతలకు ఆత్మీయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల వారి నిబద్ధతను ప్రశంసిస్తూ, గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగడానికి వారి వంటి కార్యకర్తలే బలమని కొనియాడారు. రానున్న రోజుల్లోనూ వారి సేవలు పార్టీకి ఎంతో అవసరమని ఆయన ఆకాంక్షించారు. ఈ సంబరాల్లో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా శుభాకాంక్షలు తెలిపారు.

## చింతల్లో నాలాల పూడికతీత పనుల పరిశీలన

### కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ

చింతల్, మన న్యూస్: 128వ డివిజన్ చింతల్లోని రంగనగర్లో కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ నాలాల పూడికతీత పనులను పరిశీలించారు. నీటిపారుదల శాఖ ఏఈ అశోక్, ఎన్ఏసీ ఏఈ నాగరాజు, స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆమె పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రషీదా మహ్మద్ రఫీ మాట్లాడుతూ, నాలాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి కారణంగా డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసుకుపోతోందని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాలాలను పూర్తిగా శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంగనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరప్రసాద్, రాఘవులు, రాంప్రసాద్, నర్సయ్య, రెడ్డి పద్మ, లక్ష్మి నర్సయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్**



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (మనం న్యూస్): గ్రామీణ ప్రాంతంలోని ఆర్ఎంపీ, పిఎంపీల సమస్యలను పరిష్కరించడానికి తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్యవేదిక కృషి చేస్తుందని,ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గ ఆర్ఎంపి, పిఎంపి ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి లు ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, చాలీచాలని ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని ప్రభుత్వాలు ఆదుకోవాలని అన్నారు. కరోనా లాంటి మహమ్మారిని ఎదుర్కోవడంలో క్షేత్రస్థాయిలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని సంక్షేమ పథకాలలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆర్ఎంపీ, పిఎంపి మిత్రులు ప్రాథమిక చికిత్స ను మాత్రమే అందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపి, పిఎంపీల అభివృద్ధికి, సంక్షేమానికి, తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేగుచింతల లింగం, జయప్రకాశ్, శేఖర్ రెడ్డి, కార్యదర్శ్ నాగార్జున, శ్రీనివాస్ చారి, యాచారం మండల అధ్యక్షుడు మంద మహేందర్, హయత్ నగర్ మండల అధ్యక్షులు విప్ప వెంకటేశ్వర్లు, భిక్షపతి, ప్రొద్దుటూరు రవీందర్, మండల నాయకులు సురేష్,కృష్ణ, రమేష్, శ్రీశైలం, బుచ్చిరెడ్డి, జితేందర్ చారి, లక్ష్మణ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




## పహల్గావ్ ఉగ్రదాడిని ఖండించిన కాంగ్రెస్ నేత ప్రసన్నకుమార్

బాలనగర్ , మనం న్యూస్ : జమ్మూ కాశ్మీర్ పహల్గావ్లో జరిగిన ఉగ్రదాడిని బాలనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్ తీవ్రంగా ఖండించారు. జగద్గిరిగుట్టలో అవర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని, దాడిలో మృతి చెందినవారికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, పహల్గావ్లో పౌరులపై దాడి చేసిన ఉగ్రవాదులను నడిరోడ్డుపై ఉరితీయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాంబు దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ నిర్లక్ష్యం వల్లే ఈ దాడి జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ దాడిలో 30 మందికి పైగా మరణించడం, 27 మందికి పైగా గాయపడటం బాధాకరమని అన్నారు. ఇతర దేశాల్లోనే కాకుండా సొంత దేశంలో కూడా పౌరులకు రక్షణ లేకుండా పోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆరోగ్య భద్రత నిచ్చేది ముఖ్యమంత్రి సహాయనిధి



కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన ఆర్. సత్యజిత్ రౌత్, కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన షరఫ్ శిరేఖ ఆరోగ్య పరిస్థితి బాగాలేక వైద్య సహాయార్థం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను ఆశ్రయించగా వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్. సత్యజిత్ రౌత్ కు 1.50 లక్షల రూపాయలు, షరఫ్ శిరేఖకు 1.15 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. గురువారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు బాధిత లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.ఎం.గౌరిష్, సురేష్ రెడ్డి, జగన్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, గుమ్మడి మధుసూదన్ రాజు, సదానంద్ చారి, మధు, నార్లకంటి బాలయ్య, ఇస్మాయిల్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ నాగరాజుకు ఘన నివాళి



నిజాంపేట్, మనం న్యూస్ : సీనియర్ జర్నలిస్ట్ నాగరాజు దశదిన కర్మ గురువారం నిజాంపేట రోడ్డులో జరిగింది. ఈ కార్యక్రమానికి కూక ట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరై నాగరాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, నాగరాజు జర్నలిస్టుగా తన వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. ఆయన మరణం విలేకరుల సంఘానికి తీరని లోటని అన్నారు. సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, నాగరాజు నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, విలేకరులు, నాగరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాల ఐక్యతే కీలకం

**ఎమ్మెల్యే వివేకానంద్**



కుత్బుల్లాపూర్, మనం న్యూస్ : 132వ డివిజన్లోని జీడిమెట్ల శ్రీ రాఘవేంద్ర కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు గురువారం ఎమ్మెల్యే కె.పి.వివేకానందను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి సంక్షేమ సంఘాల సమిష్టి కృషి ఎంతో అవసరమని అన్నారు. కాలనీ వాసులంతా ఐకమత్యంతో పనిచేస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్, శ్రీకాంత్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి ఉమాపతిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్లు పి.వి.వి. శ్రీనివాస్ రావు, కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సతీష్, కోశాధికారి ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

కుత్బుల్లాపూర్ , మనం న్యూస్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఒక వరంలాంటిదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం చింతల్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన దాదాపు 60 మంది లబ్ధిదారులకు రూ. 21.41 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వారు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ పథకం పేద ప్రజలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె. ఎం. గౌరిష్, జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, రఫీ, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, గుమ్మడి మధుసూదన్ రాజు, గుబ్బల లక్ష్మీనారాయణ, అడ్వకేట్ కమలాకర్, సిద్దిక్, కుంట సిద్దిరాములు, నదీం రాయ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్, నవాబ్ భాయ్, కూన వెంకటేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, యేసు, ఇస్మాయిల్, చెట్ల వెంకటేష్, బస్వరాజ్, సదానంద్ చారి, మధు, నార్లకంటి బాలయ్య, ఆంజనేయులు, వెంకటేష్, ప్రసాద్, రంజాన్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణం

(మనం ఏప్రిల్24/తలకొండపల్లి): ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి వారి కళ్యాణం హాజరైన ప్రజా ప్రతినిధులు. భక్తుల సౌకర్యార్థం విశాల వసతులు ఆలయంలో ఘనంగా పల్లకి సేవ. తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మిదేవి సమేత లక్ష్మినారాయణ స్వామి కళ్యాణోత్సవం గురువారం కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా వైభవోపేతంగా జరిగింది. ఇక్కడ స్వామి వారికి ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో మూడు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.ఈ బ్రహ్మోత్సవాలకు ఆలయ కమిటీ నిర్వహకులు భక్తుల సౌకర్యార్థం విశాల వసతులు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని చదును చేసి చలువ పందిర్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో పచ్చటి తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు.ఆలయ మండపంలో శ్రీ లక్ష్మినారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించారు. మంత్రోచ్చరణలతో మంగళ వాయిద్యాలు,మేళ తాళాలు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్,కాంగ్రెస్ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్



యాదవ్ శతాబ్దిస్ టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,కళ్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారిని ఆలయ మర్యాదలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కళ్యాణోత్సవానికి సమీప గ్రామాలతో పాటు మిడ్జిల్, కేశంపేట, మండలాల నుండి భక్తులు మహిళలు తలంబ్రాలతో పెద్ద సంఖ్యలో హాజరై కళ్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో స్వామివారికి పల్లకి సేవ,బండ్లు తిప్పుట కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ పయవుల రమేష్ యాదవ్,మాజీ చైర్మన్ అంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి,రఘు,శేఖర్ రెడ్డి, శ్రీనివాసులు,లక్ష్మయ్య, సంతోష, యాదయ్య,వెంకటయ్య, మల్లేష్,మహేష్,శేఖర్, రాము,శేఖర్ రెడ్డి,పాండు, ఆంజనేయులు,శ్రీశైలం యాదవ్,కుమార్,శేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, అంజయ్య,కాజా,రమేష్, తదితరులున్నారు.



## పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా

# వి.పి. నగర్ కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్ : కాశ్మీర్లోని పహల్గామ్లో పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ గురువారం సాయంత్రం హైదరాబాద్లోని వి.పి. నగర్ కాలనీ వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాలనీ లోపల లాస్ట్ బస్టాప్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ తిరిగి కాలనీ వరకు కొనసాగింది.ఈ నిరసన కార్యక్రమంలో చిన్నారులు, పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, బాధితులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, మన దేశంలో ఉగ్రవాదానికి ఎటువంటి స్థానం లేదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని కలిసికట్టుగా ఎదుర్కోవాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో శాంతి, భద్రతలు నెలకొనాలని వారు ఆకాంక్షించారు. ఈ ర్యాలీ ప్రశాంతంగా జరిగింది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా కాలనీ వాసులు తమ సంఘీభావాన్ని ఈ విధంగా చాటుకున్నారు.

# శేరిలింగంపల్లి అభివృద్ధికి రూ.2.09 కోట్ల నిధులు

**– ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన**

హైదర్ నగర్, మనం న్యూస్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, వరద నీటి కాల్వల నిర్మాణానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. జల వాయు విహార్, రాంనరేశ్ నగర్, అల్లపూర్ సొసైటీ, మైనారిటీ స్కూల్, విజేత గ్రీన్ హోమ్స్, కింది కుంట చెరువు నుండి కోన సీమ వంటిల్లు, హెచ్ ఎం టి శాతవాహన నగర్ కాలనీల్లో రూ. 2 కోట్ల 9 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఈ నిధులతో సీసీ రోడ్లు, వరద నీటి కాల్వలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందని, కాలనీ వాసులకు దీని ద్వారా ఉపశమనం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని, హైదర్ నగర్ డివిజన్, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానని ఆయన పునరుద్ఘాటించారు. మంజూరైన పనుల వివరాలు: జలవాయు విహార్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం (రూ. 50 లక్షలు), రాంనరేష్ నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం (రూ. 34 లక్షలు),విజేత గ్రీన్ హోమ్స్, మైనారిటీ స్కూల్, హెచ్ ఎం టి శాతవాహన నగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం (రూ. 50 లక్షలు),అల్లపూర్ సొసైటీ, కింది కుంట చెరువు నుండి కోన సీమ వంటిల్లు వరకు వరద నీటి కాల్వ నిర్మాణం (రూ. 75 లక్షలు)

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రవాణా సౌకర్యం మెరుగు

**పీఏసీ చైర్మన్ గాంధీ చేతుల మీదుగా ఆల్విన్ కాలనీలో సీసీ రోడ్ల శంకుస్థాపన**

ఆల్విన్ కాలనీ, మనం న్యూస్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోగురువారం నూతనంగా రూ. 2 కోట్ల 8 లక్షల 50 వేలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఆల్విన్ కాలనీ ఫేజ్ 1, ఫేజ్ 2, తులసి నగర్, శ్రీ తులసి నగర్, కాకతీయ నగర్, చంద్రమ్మ బస్తీ, పంచమి కాలనీ, ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీల్లో ఈ సీసీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. సీసీ రోడ్ల పనులు నాణ్యతతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన రాకపోకల కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని గాంధీ పునరుద్ఘాటించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పర్వత్ నగర్కు నీటి కష్టాలు కార్పొరేటర్కు వినతి

అల్లాపూర్, మనం న్యూస్: కూకట్పల్లి అల్లాపూర్ డివిజన్లోని పర్వత్ నగర్ కాలనీలో మంచి నీటి సరఫరా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు రాకపోవడంతో వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, ఇది తమకు ఆర్థికంగా భారంగా మారుతోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం కాలనీ వాసులు తమ గోడును అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా గౌసుద్దిన్ దృష్టికి తీసుకెళ్లారు. దయచేసి తమ కాలనీకి మంచి నీరు అందేలా చూడాలని వేడుకున్నారు. వారి వినతికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పర్వత్ నగర్ కాలనీకి చెందిన పలువురు నివాసితులు పాల్గొన్నారు



## అన్యాయానికి ఎదురొడ్డిన కార్మిక నేత రవి

కుత్బుల్లాపూర్ , మనం న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శ్రీరామ్ నగర్లోని రిషిక్ ఇంజనీరింగ్ సర్వీస్లో పనిచేస్తున్న పవన్ కుమార్ అనే కార్మికునికి జరిగిన అన్యాయంపై బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి వెంటనే స్పందించారు. గత కొన్నేళ్లుగా అవినాష్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న పవన్ కు ఫిబ్రవరి నెల వేతనం ఇవ్వకుండా కంపెనీ యాజమాన్యం ఇబ్బంది పెట్టింది. వేతనం కోసం పలుమార్లు కాంట్రాక్టర్ను అడిగినా పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన పవన్, తన తోటి కార్మికుల ద్వారా రవి గురించి తెలుసుకుని ఆయనను ఆశ్రయించాడు. వెంటనే స్పందించిన రవి హుటాహుటిన కంపెనీ వద్దకు వెళ్లి కాంట్రాక్టర్ అవినాష్తో చర్చలు జరిపారు. ఫలితంగా గురువారం కార్మికుడు పవన్ కు రావాల్సిన ఫిబ్రవరి నెల వేతనాన్ని ఇప్పించగలిగారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేయడంలో రవి ముందుండటం అభినందనీయమని అన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా ఆయన వెంటనే స్పందించి న్యాయం చేస్తున్నారని కొనియాడారు. రవికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు



## కార్మికుల దినోత్సవం మేడేను విజయవంతం చేయండి

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యెలమని స్వప్న**

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (మనం న్యూస్) : ఇబ్రహీంపట్నం మున్సిపల్ లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం విజయవంతం చేయాలని, ఇబ్రహీంపట్నం లేబర్ అడ్డాలో గురువారం గోడపత్రిక విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యెలమని స్వప్న మాట్లాడుతూ.. కార్మికుల దినోత్సవం మే డే విజయవంతం చేయాలి మేడే కార్మికుల పండుగ రోజు ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో అమరికలో చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం పోరాడి కార్మికులు ప్రాణ త్యాగం చేసి 8 గంటల పని దినాన్ని సాధించారు, అందుకు మే డే అందరికీ పండుగ రోజు ఇబ్రహీంపట్నంలో అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు హక్కుల కోసం పోరాడాలని, పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప కారల్ మారక్స్ ఇచ్చిన ఆ నినాదంతో అందరూ కార్మికుల హక్కుల కోసం పోరాడాలి, ప్రతి గ్రామంలో మేడే జెండావిష్కరణ చేసి కార్మికుల దినోత్సవం విజయవంతంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీం పట్నం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేశా, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు జి బాలమని, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మల్లెల దశరథ, హెచ్ మహేష్, యాదయ్య కళమ్మ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు..

### నిబంధనలకు విరుద్ధంగా

# అడ్డగుట్టలో పెద్ద పెద్ద షెటర్లు

**రోడ్డు ఇరుకు.. జేబులు నిండు..**
**ట్రాఫిక్ పోలీసుల తంటాలు..**
**టౌన్ ప్లానింగ్ వారి వింతలు!**
**అడ్డగుట్ట రోడ్డుపై**
**అక్రమార్కుల జోరు!**
**ట్రాఫిక్ కష్టాలు మరింత**
**ముదిరే ప్రమాదం!**



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్: కూకట్ పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట నుండి ప్రగతి నగర్కు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం అక్రమ నిర్మాణాలతో కుంచించుకుపోతోంది. వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ఈ కీలకమైన మార్గంలో ఇరువైపులా అనుమతులు లేని నిర్మాణాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి.

విశాల్ మార్ట్ పక్కన తాజాగా మరో నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా రెండు పెద్ద షెటర్లను నిర్మించి అద్దెకు ఇవ్వడానికి టు లెట్ బోర్డు పెట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో రహదారి మరింత ఇరుకుగా మారుతోంది. కొంతమంది నిర్మాణదారులు మరింత దురాశతో పార్కింగ్ స్థలాలను సైతం కమర్షియల్ షెటర్లుగా మార్చి లక్షల్లో అద్దెలు వసూలు చేస్తూ ట్రాఫిక్ సమస్యలకు మరింత ఆజ్యం పోస్తున్నారు.

ఇప్పటికే ఈ రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్లతో ప్రజలు నరకయాతన అనుభవిస్తుంటే, రాబోయే మరిన్ని వాణిజ్య నిర్మాణాలు మరింత ఇబ్బందికరంగా మారనున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలపై విసుగు చెందిన స్థానికులు పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. కొందరు అవినీతి అధికారుల అండదండలతో ఈ నిర్మాణాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో ట్రాఫిక్ అధికారులు సైతం ఇలాంటి వాణిజ్యపరమైన అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగించాలని సూచించారు. అయితే లంచాల మత్తులో తూగిన కొందరు అధికారులు వాటిని పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఈ సమస్యలను పట్టించుకోకుండా అక్రమ మార్గాల ద్వారా తమ జేబులు నింపుకుంటున్నారని ప్రజలు మండిపడుతున్నారు. కళ్లెదుటే రోడ్లు ఆక్రమణకు గురవుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ అక్రమ నిర్మాణాలను నిరోధించకపోతే రాబోయే రోజుల్లో ఈ రహదారిపై రాకపోకలు మరింత దుర్భరంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఉక్కుల అశోక్**

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (మనం న్యూస్):గ్రామీణ ప్రాంతంలోని ఆర్ఎంపీ, పిఎంపీల సమస్యలను పరిష్కరించడానికి తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్యవేదిక కృషి చేస్తుందని,ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గ ఆర్ఎంపి, పిఎంపి ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భముగా ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి లు ఎంతోమంది ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని, చాలీచాలని ఆదాయంతో జీవనాన్ని కొనసాగిస్తున్నారని ప్రభుత్వాలు అదుకోవాలని అన్నారు. కరోనా లాంటి మహామ్మారిని ఎదుర్కొవడంలో క్షేత్రస్థాయిలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని సంక్షేమ పథకాలలో ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆర్ఎంపీ, పిఎంపి మిత్రులు ప్రాథమిక చికిత్స ను మాత్రమే అందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపి, పిఎంపీల అభివృద్ధికి, సంక్షేమానికి, తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేగుచింతల లింగం, జయప్రకాశ్, శేఖర్ రెడ్డి, కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్ చారి, యాచారం మండల అధ్యక్షుడు మంద మహేందర్, హయత్ నగర్ మండల అధ్యక్షులు విప్ప వెంకటేశ్వర్లు, భిక్షపతి, ప్రొద్దుటూరు రవీందర్, మండల నాయకులు సురేష్,కృష్ణ, రమేష్, శ్రీశైలం, బుచ్చిరెడ్డి, జితేందర్ చారి, లక్ష్మణ్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పహల్గావ్ ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (మనం న్యూస్): జమ్మూ కాశ్మీర్ పహల్గావ్లో జరిగిన ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు నివాళులర్పిస్తూ బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం నియోజక వర్గం కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని, దాడిలో మృతి చెందినవారికి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పహల్గావ్లో పౌరులపై దాడి చేసిన ఉగ్రవాదులను నడిరోడ్డుపై ఉరితీయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాంబు దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ నిర్లక్ష్యం వల్లే ఈ దాడి జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ దాడిలో 27 మందికి పైగా మరణించడం, 20 మందికి పైగా గాయపడటం బాధాకరమని అన్నారు. ఇతర దేశాల్లోనే కాకుండా సొంత దేశంలో కూడా పౌరులకు రక్షణ లేకుండా పోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు...



# ఎంటమాలజీ విభాగం... -అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్



ఎల్బీనగర్, మనం న్యూస్: తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంటమాలజీ ఎల్బీనగర్ ప్రెసిడెంట్‌గా రాజేంద్రప్రసాద్ అలియాస్(చిన్న)ను యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ నియమించడం జరిగింది. ఎల్బీనగర్ జోన్ ఎంటమాలజీ అధ్యక్ష పదవితో పాటు ప్రధాన కార్యదర్శి శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్, వైస్ ప్రెసిడెంట్ ఇంద్ర, ఉప్పల్ సర్కిల్ ప్రెసిడెంట్ రాము, ప్రధాన కార్యదర్శి నరేష్ కమిటీ నియమించుకోవడం జరిగింది

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ, ఔట్సోర్సింగ్ కార్మికులకు గత ఐదు సంవత్సరాలు నుంచి జీతం పెరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో జీవిత భారాన్ని మోస్తూ ఎన్నో ఆర్థిక ఇబ్బందులలో కూరుకుపోయి చనిపోవడం జరుగుతుందన్నారు. అలా కార్మికుల చనిపోతే వారి కుటుంబంలో ఉద్యోగం ఇచ్చే విషయంలో కూడా బల్దియా విఫలమైందని బాలకృష్ణ దుయ్యబట్టారు. ఇటీవల ఎల్బీనగర్ జోన్లో సీనియర్ ఎంటమాలజిస్ట్‌గా వచ్చి 15 రోజులు కాలేదు కానీ తను కార్మికులపై ఆయినా అధికార మదంతో వారి ఇష్టారాజ్యంగా కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని.. ఇదే కొనసాగుతే దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగి వారిని తమ మాతృ సంస్థకు పంపేంతవరకు మా యూనియన్ పోరాడుతుందని బాలకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఔట్సోర్సింగ్ ప్రెసిడెంట్ రాము, ఎంటమాలజీ విభాగం నాయకులు మల్లేష్, నరసింహ, శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్, బాబు, శ్రీను, రంజిత్ యూనియన్ నాయకులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# పాకిస్తాన్ టెర్రరిస్టులను అంతం చేయాలి

కేపీహెచ్బీ కాలనీ,మనం న్యూస్ : పాకిస్తాన్ టెర్రరిస్టులను అంతం చేయాలని ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిటినీడి రామారావు, కూకట్పల్లి ఉమ్మడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్ర యాకన్న లు డిమాండ్ చేశారు. గురువారం కూకట్పల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ ప్రధాన రహదారిపై ఉన్న వివేకానంద విగ్రహం ముందు భారతదేశం లోని జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని అనంతనాగ్ జిల్లా పహల్గాం ప్రాంతంలో బైనారస్ పార్క్ ప్రాంతంలో భారతీయ పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరిపి అత్యంత క్రూరంగా హత్య చేయడంపై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న సందర్భంలో కూకట్పల్లి వివేకానంద నగర్ లో ప్రవత్తులు వెలిగించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్, నర్సింహారెడ్డి, జగన్, శ్రీహరి, సంతోష్, గణేష్, మదన్, లింగస్వామి, వి ఆర్ విజయ లింగం, జితేందర్, జగదీష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# పహల్గాం ఉగ్రదాడికి జనసేన నిరసన

కూకట్పల్లి, మనం న్యూస్ : జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా జనసేన పార్టీ నాయకులు కూకట్పల్లి నియోజకవర్గంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నిజాంపేట్ క్రాస్ రోడ్డు వద్ద జనసేన కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జి మమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి, కొవ్వొత్తులు వెలిగించి శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉగ్రవాదుల దాడులను తీవ్రంగా ఖండించారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు, తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇన్చార్జి శంకర్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాధా రాం రాజలింగం, జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్, వీర మహిళా నాయకురాళ్ళు కావ్య, శిరీష, మాధవరెడ్డి, యడమ రాజేష్, నందగిరి సతీష్, సురేష్ రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గ నాయకులు కొల్లా శంకర్, మహేష్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు





# పేదింటి ఆడపడుచు వివాహానికి ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 24 (మనం న్యూస్): మంచాల మండల్ బండలేమూర్ గ్రామానికి చెందిన రమావత్ లక్ష్మి, నాను దంపతుల ప్రథమ కుమార్తె రమావత్ జ్యోతి వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్ 10'000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.  తమ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచినందుకు మంగా శ్రీనివాస్ కి నాను లక్ష్మి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ కిషన్ నాయక్, మాజీ వార్డు నెంబర్ జనార్ధన్, ఇబ్రహీంపట్నం జనసేన నాయకుడు సభావాట్ చందు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వర్త్య లాలూ నాయక్, రాములు నాయక్, బిచ్చ నాయక్, వధువు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# కొంపల్లిలో ఇస్కాన్ గీతా సమ్మర్ క్యాంప్

**– మహాశృంగ దాస్ వెల్లడి**

కూకట్పల్లి, మనం న్యూస్: ఇస్కాన్ కూకట్పల్లి ఆధ్వర్యంలో కొంపల్లిలోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ నెల 27వ తేదీ నుంచి మే 6వ తేదీ వరకు ప్రతిష్టాత్మకమైన గీతా సమ్మర్ క్యాంప్ నిర్వహించబడుతుందని ఇస్కాన్ కూకట్పల్లి అధ్యక్షుడు మహాశృంగ దాస్ బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. గత 35 సంవత్సరాలుగా ఇస్కాన్ కూకట్పల్లి విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాలు, పిల్లల్లో జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ శిబిరాల్లో పిల్లలకు మానవీయ విలువలు, వేద సంస్కృతికి సంబంధించిన అంశాలను బోధిస్తారు. గౌరవం, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలి, కుటుంబ విలువలు, జీవిత నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలతో పాటు ఈత, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సంస్కృత శ్లోకాల శిక్షణ, యోగా, సంప్రదాయ నృత్యాలు, గానం వంటి వివిధ అంశాలలో శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు.భగవద్గీతలోని అధ్యయనం జీవితంలోని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందని మహాశృంగ దాస్ అన్నారు. ఐన్స్టీన్, థోరో, మహాత్మా గాంధీ వంటి గొప్ప వ్యక్తులు భగవద్గీత యొక్క శక్తిని గుర్తించారని ఆయన గుర్తు చేశారు. ఆధునిక కాలంలో భగవద్గీత సందేశం ఎంతో అవసరమని, పిల్లలు భగవద్గీతను నేర్చుకోవడం ద్వారా భగవంతుని ఆజ్ఞలను అనుసరించగలగడమే తమ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ శిబిరంలో పిల్లలు భజనలు, కీర్తనలు, నాటకాలు, సంగీత వాయిద్యాల ప్రదర్శనలు, శ్లోకాల పఠనం, కథలు వింటూ తమ వయస్సు పిల్లలతో కలిసి ఆనందంగా గీతా సందేశాన్ని అర్థం చేసుకుంటారని ఆయన తెలిపారు. ఈ గీతా క్యాంపుకు ప్రతి సంవత్సరం ప్రజాదరణ పెరుగుతోందని ఆయన సంతోషం వ్యక్తం



చేశారు.ఈ ఏడాది శిబిరం ఉదయం 8:01 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కొనసాగుతుంది. పిల్లల కోసం బస్సు ద్వారా పికప్ మరియు డ్రాప్ సౌకర్యం కూడా కలదు. మరిన్ని వివరాల కోసం 9652675974 నెంబర్ను సంప్రదించగలరని ఆయన విజ్ఞప్తి చేశారు